నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

12 | కరీంనగర్, శనివారం 16 నవంబర్ 2024 | PEDDAPALLI




ధర్మపురి: విద్యుద్దీపాల అలంకరణలో కోనేరు

## 'కార్తీక' శోభితం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ ఆలయాలు శుక్రవారం కార్తీక శోభను సంతరించుకున్నాయి. వేములవాడ రాజన్న ఆలయం, ధర్మపురి నృసింహ క్షేత్రం దీపకాంతులతో దేదీప్యమానంగా వెలుగొందాయి. వేములవాడ ఆలయ ప్రాంగణంలో ఎక్కడ చూసినా దీపకాంతులే దర్శనమిచ్చాయి. ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా రాత్రి ఆలయంలో జ్వాలాతోరణ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. మరోవైపు ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు. ధర్మపురి బ్రహ్మపుష్కరిణి (కోనేరు)ని వేలాది దీపాలతో అలంకరించారు.

**- వేములవాడ టౌన్/ ధర్మపురి, నవంబర్ 15**



వేములవాడ టౌన్: రాజన్న ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



వీరగల్లు విగ్రహం



నాగ ముచిలిందము



పొలాసలోని గరుడ విగ్రహం

# చారిత్రక సంపదపై నిర్లక్ష్యపు నీడ

- ఆరుబయటే అరుదైన విగ్రహాలు
- కాలగర్భంలో కలుస్తున్న ఆనాటి అభివృద్ధి మూలాలు
- పట్టించుకోని జిల్లా అధికారులు
- గతంలో బయటపడ్డ చారిత్రక నాణేలు, ఆనవాళ్లు కరీంనగర్, హైదరాబాద్ మ్యూజియాలకు తరలింపు
- అపురూప సంపదను చూసేందుకు నోచుకోని జగిత్యాల ప్రజలు
- జిల్లా కేంద్రంలో చారిత్రక ప్రదర్శన శాల ఏర్పాటు చేయాలంటున్న చరిత్రకారులు

అరుదైన, ఘనమైన చారిత్రక వారసత్వాన్ని కలిగిన జిల్లా జగిత్యాల. గోదావరినది పరీవాహకంగా అధికంగా ఉండి, మానవ కోటి నాగరికత అభివృద్ధి మూలాలు కలిగిన నేల. తొలి రాతియుగం, మలి రాతియుగం ఆనవాళ్లు, రాకాసి గూళ్లు, పురాతన పునాదులు ఉన్న ప్రాంతం. దక్షిణ భారత దేశాలను సమైక్యం చేసి పరిపాలించిన శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటి లింగాలకు ఆలవాలంగా, అరుదైన కాకతీయుల త్రికుటాలయాలకు, చాళుక్యుల నిర్మాణాలకు కేంద్రంగా, పొలవాస మేడరాజులు పాలించిన ఈ క్షేత్రంలో చారిత్రక సంపద నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్నది. అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేక ఆరుబయటే ఎండకు ఎండుతూ, వానకు తడిసిపోతున్నది. పురావస్తు అవశేషాలను నిర్లక్ష్యం చేయడంతో కాలక్రమంలో కాలగర్భంలో కలిసిపోగా, మరికొన్నింటిని కరీంనగర్, హైదరాబాద్ చారిత్రక, పురావస్తు ప్రదర్శన శాలలకు యంత్రాంగం తరలించింది. అయితే జగిత్యాల జిల్లాగా ఏర్పడ్డ నేపథ్యంలో గతంలో ఇక్కడి నుంచి వివిధ ప్రదర్శన శాలలకు తీసుకెళ్లి అరుదైన వస్తువులు, నాణేలను తిరిగి తెప్పించాలని, జిల్లాలోని చారిత్రక సంపదను కాపాడాలని డిమాండ్ వినిపిస్తున్నది.

జగిత్యాల, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): జగిత్యాల చారిత్రక సంపద 50 ఏండ్లుగా ఇతర ప్రాంతాలు, పట్టణాలకు, ప్రదర్శన క్షేత్రాలకు తరలిపోయింది. అరుదైన శిల్ప, విగ్రహాలు, నాణేలు హైదరాబాద్ పురావస్తు ప్రదర్శనశాలకు, లేదంటే కరీంనగర్‌లోని ప్రదర్శన క్షేత్రానికి వెళ్లిపోయింది. శాతవాహనుల రాజధాని అయిన కోటిలింగాలలో అనేక విలువైన పురావస్తు ఆధారాలు బయటపడ్డాయి. 1978 నుంచి 1983 వరకు పురావస్తు శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో తవ్వకాలు జరుపగా, అనేక వెండి, పంచ్‌మార్క్‌డ్ నాణేలు లభ్యమయ్యాయి. శాతవాహనుల కంటే పూర్వం పరిపాలించిన స్థానిక రాజులైన రాణో నారాయ, రాణో సమగోప, రాణో గోభద, రాణో కనయసి, నాణేలు బయటపడ్డాయి. ఈ నాణేలపై ప్రాకృత భాష కనిపిస్తుందని పురావస్తు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీటిని హైదరాబాద్ పురావస్తు ప్రదర్శన శాలకు తరలించారు. అలాగే శాతవాహనుల తొలి చక్రవర్తిగా గుర్తింపు పొందిన చిముఖ సాద్వాహన నాణేలు సైతం ఇక్కడ బయటపడ్డాయి. ఎనిమిది చిముకుడి నాణేలు లభ్యమయ్యాయి. ఈ నాణేలతో కోటిలింగాల ప్రాంతమే తొలి రాజధాని అన్న విషయం స్పష్టమైంది. అలాగే వందలాది బావులు, వేలాది పూసలు, మట్టి పాత్రలు, గొడ్డల్లు, పాత్రలు, మట్టిపాత్రలు, ఇండ్ల వరుసలు.. ఇలా అనేకం బయటపడ్డాయి. అందులో 59 బంగారు పూసల హారం అత్యంత విశిష్టమైనది. ఆ పూసల్లో కొన్ని తాబేలు, నందిపాదు, కప్ప, వజ్రం తదితర ఆకారాల్లో ఉండడం గమనార్హం. అలాంటి అరుదైన బంగారు హారాన్ని చూసే అవకాశం జిల్లా ప్రజలకు ఇంత వరకు కలగలేదు. అసలు అలాంటి ఒక హారం లభించిందన్న విషయమే ఎవరికీ తెలియదు. అలాగే మౌర్యుల కంటే ముందు కాలానికి చెందిన 418 పంచ్‌మార్క్‌డ్ నాణేలు కోటిలింగాలలో లభ్యమయ్యాయి. వీటిని హైదరాబాద్ ప్రదర్శన శాలకు తరలించారు. ఇంకా గ్రామ సమీపంలోని గోదావరి నది తీరంలో వేణుగోపాల స్వామి, కాళియ మర్దన, శేషశయనంపై పవళించిన విష్ణుమూర్తి విగ్రహాలు బయటపడగా, కరీంనగర్ ప్రదర్శన క్షేత్రానికి తరలించారు. ఇక ధర్మపురి గ్రామానికి సమీపంలోని పాశిగామ్ గ్రామంలోని అత్యంత



కోటింలింగాలలోని బౌద్ధచైత్యం

అరుదైన బౌద్ధస్తూపం దొరికింది. అయితే ఇది తవ్వకాల్లో నేలమట్టమైంది. అనంతర కాలంలో దీన్ని గుర్తించి, పగిలిన ఫలకాలను కరీంనగర్ ప్రదర్శన క్షేత్రానికి తరలించారు. ఆ ఫలకాలతో తాత్కాలికంగా స్తూపాన్ని నిర్మించారు. అది కూడా జగిత్యాలకు రావాల్సిన అవసరం ఉంది. అలాగే గుట్రాజ్‌పల్లిలో జరిగిన తవ్వకాల్లో 30 రోమన్ నాణేలు బయటపడగా, హైదరాబాద్ ప్రదర్శనశాలకు తరలించారు. జిల్లాలోని మరో చారిత్రక కేంద్రమైన పొలవాస సైతం పూర్తిగా నిరాధరణకు గురవుతున్నది. ఇక్కడ అరుదైన విగ్రహాలు అనేకం లభ్యమయ్యాయి. కొలిచాల విశ్వనాథం అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం జరిపిన తవ్వకాల్లో జైన వర్ధమాన మహావీరుడి విగ్రహం బయటపడగా, కరీంనగర్‌కు తరలించారు. రాయికల్‌లోని త్రికూటాలయానికి సంబంధించిన విగ్రహాలు, శిల్పాలు సైతం తీసుకెళ్లారు. మరికొన్ని చోరుల పాలయ్యాయి. ఇక జగిత్యాల ఖిలాలో ఒకనాటి కాలంలో 96 పిరంగులు ఉండగా, ప్రస్తుతం 42 మాత్రమే ఉన్నాయి. ఇక జగిత్యాల తహసీల్ కార్యాలయానికి గతంలో అమర్చబడిన రెండు కంచు పిరంగులు కొద్ది రోజుల క్రితం కరీంనగర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి తరలించారు.

### ఆరుబయటే సంపద

విలువైన సంపద ఇతర ప్రాంతాలకు, ప్రదర్శన క్షేత్రాలకు తరలించుకువెళ్లగా, మరెన్నో చారిత్రక కట్టడాలు ఆరుబయట ఆలనాపాలన లేకుండా పడి ఉన్నాయి. పొలాసలో రెండు అరుదైన కన్నడ శాసనాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ వద్ద ఉన్న కన్నడ శాసనాన్ని భూమి నుంచి పెకిలించి నిర్లక్ష్యంగా పడేశారు. ఇక పొలస్తేశ్వర ఆలయంలో వీరగల్లు శిల్పం నుంచి మొదలుకొని అనేక శిల్పాలు ఆరుబయటే పడి ఉన్నాయి. రాయికల్ మండల కేంద్రంలోని త్రికుటాలయంలో క్రీ.శ 1305 సంవత్సరానికి చెందిన ప్రతాప రుద్రుడి శాసనం తన ఉనికిని కోల్పోయింది. జాబితాపూర్‌లో రోడ్డుపై ఓ చిన్న గద్దెపై అరుదైన అన్నపూర్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కాశీలో మాత్రమే అలాంటి అరుదైన అన్నపూర్ణ మాత విగ్రహం ఉందని పురావస్తుశాస్త్రవేత్తలు, చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోరుట్ల పట్టణంలో మహదేవ ఆలయంలో బాహుబలి, పార్శ్వనాథుడి విగ్రహాలు, వర్ధమానుడి విగ్రహ ప్రభా మండలం ఎందుకు పనికిరాకుండా, ఎవరికీ తెలియకుండా రహస్యంగానే ఉండిపోతున్నాయి. పొలవాసలో జైన తీర్థంకరుల విగ్రహాలు గుట్టపై నిర్లక్ష్యంగా పడేశారు. జగిత్యాల జిల్లా పశ్చిమ చాళుక్యుల కాలానికి చెందిన అనేక గణపతి, నంది విగ్రహాలు దర్శనమిస్తూనే ఉన్నాయి. రాయికల్ మండలంలోని వస్తాపూర్ గ్రామం అత్యంత ప్రాచీనత కలిగిన గ్రామంగా చరిత్రకారులు గుర్తించారు. ఇక్కడ పాతరాతి యుగానికి సంబంధించిన బృహత్ శిలా సమాధులను గుర్తించారు. అలాగే కట్కాపూర్ గ్రామంలో ఇటీవలి కాలంలో అనేక అరుదైన ప్రాచీన విగ్రహాలు బయటపడ్డాయి. ఉమ శంకరుల విగ్రహం, గణపతి విగ్రహం, వైష్ణవ సాంప్రదాయ విగ్రహాలు ఉన్నాయి. ధర్మపురి మండలం స్థంభంపల్లి గ్రామంలో పరిశోధన నిర్వహిస్తే, బౌద్ధ, జైన ప్రతిమలు, స్తూపాలు లభ్యమయ్యే అవకాశాలున్నాయి. నక్కలపేట గ్రామ శివారులో తీర్థంకరుడి విగ్రహం లభ్యమైంది. అలాగే బైరవుడు, షణ్ముకుడు, నంది, నాగిని విగ్రహాలు వీరభద్రుడి విగ్రహాలు ఇలా అనేక చారిత్రక అంశాలు కనిపిస్తున్నాయి. పెగడపల్లి మండలం ఆరవెల్లి గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయం ముందు, నాయకురాలు నాగమ్మ ఆలయం సమీపంలో విలువైన శిల్పాలు ఇష్టారాజ్యంగా పడేశారు. ఇలా వేలాది విగ్రహాలు, నందులు, నాగిని ప్రతిమలు, అరుదైన శిల్పాలు ఆదరణకు నోచుకోవడం లేదు.



విదేశీ నాణేలు

### ప్రదర్శన క్షేత్రం కావాలంటున్న జనం

జగిత్యాల జిల్లా కేంద్రంగా మారి ఎనిమిదేండ్లు అవుతోందని, ఇక్కడి చరిత్రను ఇక్కడే ప్రదర్శించాల్సిన అవసరం ఉందని జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న జగిత్యాలలో ఇంత వరకు పురావస్తు ప్రదర్శన క్షేత్రం లేకపోవడం, ఇక్కడ బయటపడ్డ సంపద ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన నేపథ్యంలో చారిత్రక వారసత్వ శూన్యత ఆవహించిందని చరిత్రకారులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలో పురావస్తు ప్రదర్శన శాలను ఏర్పాటు చేయాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న చారిత్రక స్థావరాలపై పరిశోధన జరిపి, ఇక్కడి చారిత్రక సంపదను పురావస్తు ప్రదర్శన శాలకు తీసుకురావాలంటున్నారు. అలాగే హైదరాబాద్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పురావస్తు ప్రదర్శన శాలకు, కరీంనగర్‌లోని గాంధీ పురావస్తు ప్రదర్శనశాలకు తరలించిన అనేక నాణేలు, విగ్రహాలు, శాసనాలు, చారిత్రక సంపదను సైతం తీసుకురావాలని కోరుతున్నారు.

# గ్రూప్-4లో యువకుల సత్తా

- నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నోటిఫికేషన్, పరీక్ష
- నేడు కొలువులు సాధించి సత్తా చాటిన యువకులు
- ఒకే గ్రామంలో నలుగురికి ఉద్యోగాలు
- అందులో ఇద్దరు అన్నదమ్ములు
- వీణవంక మండలంలో ఒకరికి నాలుగు జాబ్స్
- జూలపల్లి మండలంలో ఒకరికి మూడు కొలువులు



పిల్లలమర్రి వినోద్



పిల్లలమర్రి అరవింద్

ధర్మారం/ వీణవంక/ జూలపల్లి, నవంబర్ 15 : గ్రూప్-4 ఉద్యోగాల్లో యువతీ యువకులు సత్తా చాటారు. నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4 నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించగా, తాజాగా ఫలితాలు వెల్లడయ్యాయి. అందులో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన నలుగురు యువకులు (జూనియర్ అసిస్టెంట్) ఉద్యోగాలు సాధించారు. ఇందులో ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. పిల్లలమర్రి వినోద్, అరవింద్ అన్నదమ్ములు కాగా, అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు లైశెట్టి అఖిల్, అలువాల కమలాకర్ కొలువులు కొట్టారు. అందరిదీ వ్యవసాయ కుటుంబాలే కాగా, తొలి ప్రయత్నంలో ఒకే గ్రామానికి చెందిన యువకులు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### వెంకటేశ్‌కు నాలుగు ఉద్యోగాలు



వీణవంక మండలంలోని ఐలాబాద్‌కు చెందిన పురంశెట్టి వెంకటేశ్ పటేల్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆ యువకుడు బాసర ట్రిపుల్ ఐటీ బీటెక్ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చదివాడు. గతంలో ఏఈఈ గెజిటెడ్ ఆఫీసర్, ఏఈ మున్సిపల్, ఎస్సెస్సీలో జూనియర్ ఇంజినీర్ ఉద్యోగం సాధించగా, గ్రూప్-4 ఫలితాల్లో సత్తాచాటాడు. ప్రస్తుతం వెంకటేశ్ జగిత్యాల జిల్లా పంచాయతీరాజ్‌లో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు.

### సాయికుమార్‌కు మూడు కొలువులు

జూపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి గోరువంతుల సాయికుమార్ మూడు ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యవకుడు, ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేశాడు. అతడికి ఏడాది వయస్సునప్పుడే తండ్రి శంకరయ్య అదృశ్యం కావడంతో తల్లి ప్రమీల కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషించింది. కనీసం ఉండడానికి ఇల్లు లేక ప్రమీల తన అమ్మగారింట్లో జీవిస్తున్నది. ఈ క్రమంలో ఆత్మస్థైర్యం కోల్పోకుండా సాయికుమార్ మొదటి ప్రయత్నంలోనే 2023లో సీఐఎస్ఎఫ్ ఉద్యోగం సాధించాడు. ఆ తర్వాత ఇటీవల తెలంగాణ పోలీస్ ఉద్యోగ నియామకాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై ఖమ్మం సీటీసీలో దాదాపు 9 నెలల నుంచి శిక్షణ పొందుతున్నాడు. గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో వార్డ్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు.





# పత్తి రైతు దిగాలు



- పంట ఒక్కసారి ఏరగానే ఖాళీ
- కీలక దశలో వర్షాలు లేక రాలిన పూత, కాత
- ఎకరాకు సగటున 4 నుంచి 6 క్వింటాళ్లే దిగుబడి
- దక్కని మద్దతు ధర
- పెట్టుబడి ఎల్లడం గగనమే
- ఈ యేడాది నష్టాలే

పత్తి చేన్లు దిగుబడి లేక తెల్లబోతున్నాయి. వాతావరణ పరిస్థితులు రైతులను కుంగదీస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో పడిన వర్షాలను చూసి మంచి దిగుబడి వస్తుందని ఆశపడినా.. ఎడతెరిపి లేకుండా పడిన ముసురుతో పంటలు దెబ్బతిని నిరాశే మిగిల్చింది. ఆపసోపాలు పడుతూ వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటను కాపాడుకున్నా ఫలితం లేకపోయింది. అయితే పూత, కాత దశ రాగానే దిగుబడిపై కలలుకనగా, దసరా ముందు వర్షాలు ముఖం చాటేయడం, వాతావరణంలో మార్పులు రావడంతో పూత, పిందె రాలిపోయింది. చేను ఎర్రబడి, బెందడి రోగం రావడంతో దిగుబడి పడిపోయింది. మూడు దశల్లో పత్తి తీయాల్సి ఉండగా, ఒకటి, రెండు సార్లకే చేన్లు లూటీ అవుతున్నాయి. జనవరి వరకు పత్తితో కళకళలాడాల్సిన చేన్లు నవంబర్‌లోనే బోసిపోతున్నాయి.

కోనరావుపేటలో పత్తి చేనులో పత్తిని తీస్తున్న కూలీలు



### నిండా ముంచింది



పత్తి సాగు ఈ యేడాది కౌలు రైతులను నిండా ముంచింది. నాకున్న భూమిలో ఎకరన్నరతో పాటు మరో ఎనిమిది ఎకరాల భూమిని ఎకరాకు ₹10 వేలు చెల్లించి కౌలుకు తీసుకుని పత్తి పంట వేసిన. ఆరంభంలో వర్షాలు సమృద్ధిగానే కురిసినప్పటికీ పంట దిగుబడి బాగానే వస్తదని అనుకున్న. కానీ, ముసురు పడడంతో పంట ఎదుగుదల నిలిచిపోయింది. క్రమ పద్ధతిలో ఎరువులు వాడి ఒక దశకు తీసుకురాగా పూత, కాత దశలో వర్షాలు కురవడంతో పూతంతా రాలిపోయింది. దీంతో మూడు సార్లు ఏరాల్సిన పత్తి మొదటిసారికే పంట చేను బోసిపోయింది. తొమ్మిదిన్నర ఎకరాలకు ఇప్పటివరకు 25 క్వింటాళ్లే వచ్చింది. మరో 10 నుంచి 15 క్వింటాళ్లు వస్తది కావచ్చు. దిగుబడి తక్కువే అయినా కనీస మద్దతు ధర దక్కలేదు. దీంతో ఈ యేడాది తీవ్రంగా నష్టపోయిన.

**- కాసర్ల ఏదిరెడ్డి, కౌలు రైతు, కనగర్తి (కోనరావుపేట)**

### కాత లేదు.. దిగుబడి లేదు



నేను రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగుచేసిన. ఈసారే పత్తి విత్తనాల రేటు, ఎరువుల రేట్లు పెరిగినా వెనకాడకుండా నాణ్యమైన వాటిని తీసుకువచ్చి వేసిన. ముసురుతో వానలు పడడంతో పంట ఆశించిన స్థాయిలో రాలేదు. పంటంతా ఎర్రబడి పోయి, మొక్క ఆకురాల్చడం, కాత, పూత నిలిచిపోయింది. దీంతో పది క్వింటాళ్ల పత్తి కూడా దిగుబడి రాలే. మార్కెట్‌లో కూడా మద్దతు ధర కూడా రాకపోవడంతో ఎకరాకు ₹30వేల వరకు నష్టపోయిన.

**- అల్లూరి తిరుపతిరెడ్డి, యువరైతు, మూడపల్లి (చందుర్తి)**

కోనరావుపేట, నవంబర్ 15: మద్దతు ధర గతేడాది కంటే ₹వెయ్యి పెరగడంతో ఈ యేడాది రైతులు పత్తి సాగువైపు ఆసక్తి చూపారు. ఆరంభంలో పత్తి విత్తనాల ధరలు పెరిగినా ఉత్సాహంగా సాగుచేశారు. ఒక రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల్లో 42,332 ఎకరాలు వేశారు. దుక్కి దున్నింది మొదలు, పత్తిని మార్కెట్ తరలించే వరకు ఎకరాకు ₹35 వేల నుంచి ₹45 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాలు కూడా సమృద్ధిగా పడడంతో ఎకరాకు 12 నుంచి 16 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశపడ్డారు. కానీ, వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్లే వస్తుండడంతో నిరాశ చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### దక్కని మద్దతు

సాధారణంగా మార్కెట్‌లో పంట ఉత్పత్తి తక్కువగా ఉంటే పంటకు డిమాండ్ ఉంటుంది. కానీ, ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పత్తి దిగుబడి తక్కువగా ఉన్నా మార్కెట్‌లో ధర లేని పరిస్థితి నెలకొన్నది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కల్పించిన ₹7521 మద్దతు ధర కూడా దక్కడం లేదు. నాణ్యతలేమి, తేమశాతం అనే కొర్రీలతో వ్యాపారులు క్వింటాల్‌కు ₹6500 నుంచి ₹7వేలలోపే ధర చెల్లిస్తున్నారు. ప్రభుత్వం సీసీఐని రంగంలోకి దించినప్పటికీ కూడా రైతులకు ప్రయోజనం కలుగడం లేదు. దీంతో గ్రామాల్లో దళారులు చెప్పిన ధరకే పత్తిని విక్రయిస్తూ నష్టాలపాలవుతున్నారు. దీంతో దూది రైతుకు దు:ఖమే మిగులుతోంది.

### కౌలు రైతు కుదేలు

పత్తిసాగుతో రైతుల పరిస్థితి పూర్తిగా దయనీయంగా మారింది. భూమి ఉన్న రైతులు ఒక ఎకరాకు ₹15 వేల నుంచి ₹25 వేల వరకు నష్టపోగా, కౌలు రైతులు రెట్టింపు నష్టపోతున్నారు. ఎకరాకు ₹45 వేల వరకు పెట్టుబడి పెట్టడంతోపాటు భూ యజమానికి ఎకరాకు ₹15వేల నుంచి ₹16 వేల వరకు కౌలు చెల్లించారు. దీంతో ఎకరాకు ₹30వేల నుంచి ₹40వేల వరకు నష్టాల్లో కూరుకుపోతున్నారు.

### పెట్టుబడి కూడా కష్టమే..



ఈసారి పత్తిలో పెట్టుబడి రావడమే కష్టంగా మారింది. నేను రెండు, మూడేళ్ల సంది భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంట సాగుచేస్తున్న. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యేడాది వర్షాలు సకాలంలో కురియక తీవ్రంగా నష్టపోయిన. నాకున్న రెండు ఎకరాలతోపాటు మరో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని, ఎకరాకు ₹16 వేలను ముందుగానే కౌలు చెల్లించిన. ఆరంభంలో పత్తి మంచిగానే మొలకెత్తి మొక్కలు ఎదిగినా దసరా తర్వాత పూత, కాత దశలో వర్షం లేకుండా పోయింది. దీంతో పొడి వాతావరణంతో ఎర్ర బెందడి రోగం వచ్చి మొక్కలకు ఉన్న పూత రాలిపోయింది. దీంతో మొక్కకు 70 నుంచి 100 కాయలు ఉంటాయని అనుకున్న. కానీ, 20 నుంచి 30 కాయలు కూడా కాయలేదు. ఇగ మొదటిసారి కూలీలకు ₹350 చెల్లించి పత్తి ఏరిపిస్తే ఏడు ఎకరాలకు 10 క్వింటాళ్ల పత్తి వచ్చింది. పత్తి తడిగా ఉండడంతో వెంటనే అమ్మిన. ₹6200 మాత్రమే ధర పలికింది. రెండోసారి మరో 15 క్వింటాళ్ల పత్తి వచ్చింది. మొత్తంగా కౌలు డబ్బులతోపాటు పెట్టుబడి కూడా నష్టపోయిన.

**- దావేర దేవయ్య, రైతు, మామిడిపల్లి (కోనరావుపేట)**